


# కరపత్రం

SINCE 2014

గురువారం సెప్టెంబర్ 03, 2026 | సంపుటి : 2 | సంచిక : 323 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4



## తెలంగాణ విమానాశ్రయాల పనులు

# వేగవంతం చేయండి

### మామునూరు, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులపై కేంద్రంతో సీఎం చర్చ

### మామునూరు భూసేకరణ పూర్తయింది: రేవంత్

- రెండు వారాల్లో మామునూరు ఎయిర్‌పోర్ట్ టెండర్లు
- డిసెంబరులో టెండర్ల ఖరారు.. అదే నెలలో శంకుస్థాపన
- ఆదిలాబాద్‌లో కార్గో, ప్యాసింజర్ టెర్మినల్ కోరిన సీఎం
- ఆదిలాబాద్‌లో ఎంఆర్‌వో వసతుల ఏర్పాటుకు విజ్ఞప్తి
- రన్‌వే ఫైనలైజ్‌కు రక్షణ, పౌర విమానయాన శాఖల భేటీ
- తెలంగాణలో హెలీ టూరిజం అభివృద్ధికి చర్యలు చేపట్టండి
- హుస్సేన్‌సాగర్‌లో సీ ప్లేన్ ల్యాండింగ్‌పై 2 వారాల్లో నివేదిక

న్యూఢిల్లీ: తెలంగాణలో ఆదిలాబాద్, మామునూరు (వరంగల్) విమానాశ్రయాల పనులు వేగవంతం చేయాలని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మామునూరు విమానాశ్రయానికి అవసరమైన భూ సేకరణను పూర్తి చేసి ఇచ్చామని కేంద్ర మంత్రికి సీఎం తెలిపారు. ఢిల్లీలోని పౌర విమానయాన శాఖ కార్యాలయం రాజీవ్ గాంధీ భవన్‌లో బుధవారం (సెప్టెంబర్ 2) కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఆదిలాబాద్ విమానాశ్రయంలో కార్గో, ప్యాసింజర్ టెర్మినల్, ఎంఆర్‌వో (మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్) వసతులు ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. ఆదిలాబాద్‌లో రన్ వే ఫైనలైజ్‌కు సంబంధించి రక్షణ, పౌర విమానయన శాఖల సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ టెండర్లను రెండు వారాల్లో పిలిచి డిసెంబరు నాటికి ఖరారు చేసి పనులకు అదే నెలలో శంకుస్థాపన చేస్తామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలియజేశారు.

తెలంగాణలో ఛాపర్ల ద్వారా హెలీ టూరిజం అభివృద్ధికి కృషి చేయాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. హెలీ టూరిజంతో తెలంగాణలో పర్యాటక రంగం మరింత అభివృద్ధికి అవకాశం ఉంటుందని సీఎం తెలియజేశారు. హుస్సేన్ సాగర్?లో సీ ప్లేన్ ల్యాండింగ్‌కు సంబంధించిన నివేదికను రెండు వారాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని పౌర విమానయాన శాఖ అధికారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలియజేశారు.




## కొండా సురేఖ అంశం అధిష్టానంతో వివరించాం.. పీసీసీ చీఫ్

హైదరాబాద్: కాంగ్రెస్ మంత్రి కొండా సురేఖ అంశంపై పీసీసీ చీఫ్ కీలక వ్యాఖ్యలు చేశారు. కొండా సురేఖ అంశంపై సుదీర్ఘంగా చర్చించామని తనతో పాటు సీఎం రేవంత్ రెడ్డి ఈ వ్యవహారంపై అధిష్టానానికి తగిన సమాచారం ఇచ్చామన్నాము. ఇక ఆ వ్యవహారంలో అంతిమ నిర్ణయం తీసుకోవాల్సిన బాధ్యత అధిష్ఠానందేనని పీసీసీ చీఫ్ అన్నారు.




## KPHB లో గజం భూమి రూ.2.70 లక్షలు!

- హౌసింగ్ బోర్డు వేలంలో రికార్డు ధర
- 16 ప్లాట్లకు 19 మంది బిడ్డర్ల పోటీ
- కనీస ధర రూ.1.60 లక్షలు.. గరిష్ఠం రూ.2.70 లక్షలు
- గజం సగటు ధర రూ.1.79 లక్షలు
- 16 ప్లాట్లతో బోర్డుకు రూ.47.14 కోట్ల ఆదాయం
- కేపీహెచ్‌బీ భూములకు కొనసాగుతున్న భారీ డిమాండ్

2 లో

## కాంగ్రెస్ 1000 రోజుల

# ప్రజా పాలన సక్సెస్




- రైతే రాజుగా కాంగ్రెస్ పాలన
- వరి సాగులో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్
- 10 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చాం
- ఎన్నికల హామీలన్నీ నెరవేరుస్తున్నాం
- బీఆర్ఎస్ హయాంలో ధనిక రాష్ట్రం అప్పుల రాష్ట్రంగా మారింది
- రెండేళ్లలో 15 లక్షల కొత్త రేషన్ కార్డులు
- మరో 3 లక్షల మందికి వృద్ధాప్య, వితంతు పింఛన్లు
- రాహుల్‌గాంధీపై కేటీఆర్ వ్యాఖ్యలు సంస్కారహీనం

2 లో

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యిరోజుల ప్రజా పాలనలో సామాన్యుల కష్టాలు తీర్చేందుకు కృషి చేశామని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ముఖ్యమైన అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని.. ప్రజల అవసరాలకు అనుగుణంగా తమ పాలన కొనసాగుతోందని చెప్పారు. రాష్ట్ర సచివాలయంలో సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరితో కలిసి పొంగులేటి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలపై ఆయన విమర్శలు గుప్పించారు.

"రైతే రాజుగా కాంగ్రెస్ పాలన కొనసాగుతోంది. వరి వేస్తే ఉరేనని ఆనాటి దొర అన్నారు. మా ప్రభుత్వం రాగానే ఆ పంటకు బోనస్ ఇస్తున్నాం. వరి సాగులో దేశంలోనే ప్రథమ స్థానం సాధించాం. గత ప్రభుత్వం నిరుద్యోగులను విస్మరించింది. గ్రూప్-1 ప్రశ్నపత్రాలను అమ్ముకున్నారు. మా ప్రభుత్వం రాగానే టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశాం.

## ఖర్గేతో రేవంత్, భట్టి భేటీ.. కీలక అంశాలపై చర్చ!

ఢిల్లీ: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భేటీ అయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్రానికి చెందిన పలు కీలక అంశాలపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. మంత్రి కొండా సురేఖ వ్యవహారం, క్యాబినెట్ విస్తరణ, పార్టీ, ప్రభుత్వ వ్యవహారాలపై ఖర్గేతో రేవంత్, భట్టి చర్చించినట్లు సమాచారం. భేటీ అనంతరం ఖర్గే కారులోనే వైఎస్ఆర్ అవార్డుల కార్యక్రమానికి వారిద్దరూ వెళ్లారు.



## బీసీనైన నాకో న్యాయం.. ఇతరులకు మరో న్యాయమా?

- అధిష్ఠానం నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నా: కొండా సురేఖ
- నన్ను రాజీనామా చేయమని ఇప్పటివరకు చెప్పలేదు
- ఇతర మంత్రులపై ఆరోపణల సంగతేంటి?
- వారిపై ఏం చర్యలు తీసుకుంటారు?
- ఖర్గే, రాహుల్, ప్రియాంకకు ఇప్పటికే రాతపూర్వకంగా తెలిపా



2లో..

## కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్

- ఎటు చూసినా విధ్వంసం, వికృతమే: కేటీఆర్
- కాంగ్రెస్ పాలన కాదు.. పీడన: కేటీఆర్
- రూ.4.50 లక్షల కోట్ల అప్పులు.. అభివృద్ధి ఎక్కడ?
- రూ.50 వేల కోట్ల రుణమాఫీ హామీ.. రూ.20 వేల కోట్లే చేశారని ఆరోపణ
- రైతులకు అన్యాయం.. కాళేశ్వరంపై కక్ష: కేటీఆర్
- 'జాబ్ క్యాలెండర్' కాదు.. 'జాబ్‌లెస్ క్యాలెండర్
- ఢిల్లీకి మూటలు.. పదవుల కోసం కీచులాటలు
- రైతుబంధు బంద్.. 'రాహుల్ బంధు' మొదలైంది
- జల వాటాల్లో అన్యాయం జరిగితే వదిలిపెట్టం: కేటీఆర్

2 లో

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్ విడుదల చేసింది.




## మరోసారి రాజగోపాల్‌రెడ్డి

# సంచలన వ్యాఖ్యలు

- కాంగ్రెస్‌లో వలస నేతల పెత్తనం: రాజగోపాల్‌రెడ్డి
- అసలు కాంగ్రెస్ నేతలనే పక్కనబెడుతున్నారు
- మా ఇంట్లోకి వచ్చి మమ్మల్నే వెళ్లగొడుతున్నారు
- భవిష్యత్తులో సీఎం కావడం ఖాయం: రాజగోపాల్‌రెడ్డి
- పదవులు అవే వెతుక్కుంటూ వస్తాయి
- మంత్రి పదవి హామీ ఇచ్చి మాట తప్పారు
- పార్టీ, ప్రభుత్వ వ్యవస్థల్లో మార్పు రావాలి
- అభివృద్ధి పనులు నిలిచిపోతే గళం విప్పుతా

2 లో



హైదరాబాద్: మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీలోని వలస నేతలు, కేబినెట్ మంత్రులను లక్ష్యంగా చేసుకుని ఆయన చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ వర్గాల్లో పెద్ద దుమారం రేపుతున్నాయి. తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాలు ఢిల్లీ చేరిన తరుణంలో కోమటిరెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు పార్టీ అంతర్గత విభేదాలను మరోసారి బట్టబయలైనట్లైంది. 'కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను నమ్ముకుని ఉన్న అసలైన నేతలను పక్కనబెడుతున్నారు. వేరే పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన కొందరు నేతలు పార్టీని కబ్జా చేస్తున్నారు.

## కాంగ్రెస్ 1000 రోజుల పాలన సూపర్ సక్సెస్: ఉత్తమ్



- తెలంగాణ హక్కుల విషయంలో ఎక్కడా రాజీ పడలేదు
- రేవంత్ నాయకత్వంలో ప్రజలకు మంచి పాలన
- సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, ధాన్యం కొనుగోలుతో సంక్షేమం
- నాలుగు ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు కోరాం
- తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుపై 152 మీటర్ల ఎత్తుకు డిమాండ్
- కేంద్రం నుంచి అనుమతులపై స్పష్టమైన హామీ వచ్చింది
- తెలంగాణ సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లాం

వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన సూపర్ సక్సెస్.. తెలంగాణ హక్కుల విషయంలో ఎక్కడా రాజీపడలేదు: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన సూపర్ సక్సెస్ అయ్యిందని అన్నారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. బుధవారం ( సెప్టెంబర్ 2 ) మీడియాతో మాట్లాడుతూ ఈమేరకు కీలక వ్యాఖ్యలు చేశారు ఉత్తమ్ కుమార్ రెడ్డి. తెలంగాణ హక్కుల కోసం ఎక్కడా రాజీపడలేదని అన్నారు.నాలుగు ప్రాజక్టుల కోసం పర్యావరణ అనుమతులు ఇవ్వాలని కోరామని... కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ స్పష్టమైన హామీ ఇచ్చారని అన్నారు.

2లో..



## ఫ్యామిలీ ప్రాబ్లమ్స్ వల్ల KTR ఫ్రస్టేషన్ లో మాట్లాడుతున్నడు: మంత్రి వివేక్ వెంకట స్వామి

వెయ్యి రోజుల కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నామని.. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నామని.. కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి చెప్పారు. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో 17 లక్షల మందికి రేషన్ కార్డులు ఇచ్చామని.. సన్న బియ్యం పంపిణీ ద్వారా పేదల కడుపు నింపుతున్నామని ఆయన గుర్తుచేశారు. 2026, సెప్టెంబర్ 2వ తేదీన ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన మంత్రి.. బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న ఆరోపణలను ఖండించారు.
మాజీ మంత్రి కేటీఆర్ ఏదేదో మాట్లాడుతున్నారని.. అతని ఫ్యామిలీలో ఉన్న ప్రాబ్లమ్స్ వల్ల ఫ్రస్టేషన్ తో ఉన్నాడని మంత్రి వివేక్ వెంకటస్వామి చురకలు అంటించారు.

## యూకేలో ఎంబీఏ.. బాసర బ్రిడ్జిపై నుంచి పడి యువకుడి మృతి

నవీపేట: నిర్మల్ జిల్లా బాసరలో విషాదం చోటుచేసుకుంది. నిజామాబాద్ జిల్లా నందిపేట మండలం కౌల్పూర్ గ్రామానికి చెందిన రమావత్ సాయికిరణ్ (25) గోదావరి నదిలో పడి చనిపోయాడు. యూకేలో ఎంబీఏ చేస్తున్న అతడు ఇటీవల స్వగ్రామానికి వచ్చాడు.



# యుద్ధంలో పరిష్కారం దొరకదు.. చర్చలు, దౌత్యమే అసలైన మార్గం : SCO సమ్మిట్ లో ప్రధాని మోదీ

- యుద్ధక్షేత్రాల్లో పరిష్కారాలు దొరకవ్
- చర్చలు, దౌత్యమే అసలైన మార్గాలు.. ఎస్‌సీవో సమిట్‌లో ప్రధాని మోదీ
- టెర్రరిజం పట్ల డబుల్ స్టాండర్డ్స్ ఉండొద్దంటూ పాక్‌కు చురకలు
- షెహబాజ్ షరీఫ్, షీ జిన్‌పింగ్ సమక్షంలోనే భారత్ వైఖరి వెల్లడి
- ఇతర దేశాల సార్వభౌమత్వాన్ని గౌరవించాల్సిందేనని స్పష్టం



యుద్ధభూమిలో ఏ సమస్యా పరిష్కారం కాదని, ఎలాంటి వివాదాలైనా దౌత్యం, చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. కిర్గిస్తాన్‌లో జరుగుతున్న షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) శిఖరాగ్ర సదస్సులో ఆయన ప్రసంగించారు. రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా ప్రెసిడెంట్ షీ జిన్‌పింగ్, పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సమక్షంలోనే మోదీ ఉగ్రవాద అంశంపై గట్టిగా గళమెత్తారు.
"ఉగ్రవాదం విషయంలో ద్వంద్వ ప్రమాణాలకు ఏమాత్రం తావులేదని ప్రపంచ దేశాలన్నీ ముక్తకంఠంతో చాటిచెప్పాలి. ఉగ్రవాదానికి అందే నిధులు, నియామకాలు, తీవ్రవాద ప్రేరణ, సురక్షిత స్థావరాలు.. వీటన్నింటితో కూడిన వ్యవస్థను సమూలంగా నిర్మూలించాల్సిన అవసరం ఉంది"అని వ్యాఖ్యానించారు. పాకిస్తాన్ అనుసరిస్తున్న ఉగ్రవాద మద్దతు విధానాలను పరోక్షంగా ఎండగట్టారు.

**- సార్వభౌమత్వాన్ని గౌరవించాలి**

రీజియనల్ కనెక్టివిటీ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టుల విషయంలో దేశాల మధ్య పరస్పర సహకారం ఉండాలని, అయితే అవి ఇతర దేశాల సార్వభౌమాధికారాన్ని, ప్రాదేశిక సమగ్రతను గౌరవించినప్పుడే సాధ్యమవుతుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) గుండా సాగుతున్న 'చైనా----పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్' (సీపెక్) ప్రాజెక్టును ఉద్దేశించి ఆయన పరోక్షంగా ఈ వ్యాఖ్యలు చేశారు.

సెక్యూరిటీ, కనెక్టివిటీ, ఆపర్చునిటీ అనే 3 ప్రధాన సూత్రాలపై ఎస్‌సీవో కార్యాచరణ ఉండాలని, సభ్య దేశాల ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటమే అసలైన విజయమని ప్రధాని పేర్కొన్నారు. "డ్రగ్స్ అక్రమ రవాణా నేరం మాత్రమే కాదు. యువతకు, ప్రాంతీయ భద్రతకు ఒక తీవ్రమైన ముప్పు" అని హెచ్చరించారు. కాగా, పొరుగు దేశాల మధ్య సత్సంబంధాలు, పరస్పర విశ్వాసాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఏర్పాటైన ఎస్‌సీవో వేదికలో ప్రస్తుతం భారత్, రష్యా, చైనా, పాకిస్తాన్‌తో పాటు మొత్తం 10 పూర్తిస్థాయి సభ్యదేశాలు ఉన్నాయి.

**- స్వదేశానికి మోదీ..**

ప్రధాని నరేంద్ర మోదీ రెండు దేశాల (ఉజ్బెకిస్తాన్, కిర్గిస్తాన్) పర్యటన విజయవంతంగా ముగిసింది. పర్యటనలో భాగంగా ఆయన పలు దేశాల అధినేతలతో ద్వైపాక్షిక చర్చలు జరపడంతోపాటు బిష్కెక్‌లో జరిగిన ఎస్‌సీవో వార్షిక శిఖరాగ్ర సదస్సులో పాల్గొన్నారు. మంగళవారం ఆయన స్వదేశానికి తిరుగు పయనమయ్యారు. బిష్కెక్ విమానాశ్రయంలో మోదీకి కిర్గిస్తాన్ మంత్రివర్గ చైర్మన్ ఆదిల్‌బెక్ కాసిమలీవ్ వీడ్కోలు పలికారు.

# కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు.
"కాంగ్రెస్ పాలనలో ఎటు చూసినా విధ్వంసం, వికృతం. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన కాదు.. ఇది పీడన. జలద్రోహం చేస్తున్న జలగల పాలన. ఈ శతాబ్దపు అతిపెద్ద మోసం కాంగ్రెస్ మేనిఫెస్టో. పేదల భూములు నిషేధిత జాబితాలో పెట్టి 30శాతం కమీషన్లు తీసుకుంటున్నారు. అభివృద్ధి పనులు చేయకున్నా.. రాష్ట్ర ప్రభుత్వం 4.50లక్షల కోట్ల అప్పులు చేసింది. కాంగ్రెస్ అసమర్థత ప్రొ మ్యాక్స్, అవినీతి అల్ట్రామ్యాక్స్, అరాచకం ఐమ్యాక్స్. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని కుక్కలు చింపిన విస్తరిలా తయారుచేసింది. రూ.50వేల కోట్లు రుణమాఫీ చేస్తామని.. రూ.20వేల కోట్లు చేశారు. రుణమాఫీ చేస్తామని.. సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్ల మీద ఒట్టుపెట్టారు. మాఫీ చేయకుండానే.. 70శాతం మంది రైతులకు కుచ్చుటోపీ పెట్టారు. తెలంగాణను దేశానికే అన్నపూర్ణగా కేసీఆర్ మారిస్తే.. కాంగ్రెస్ నాశనం చేసింది. రాష్ట్రంలో దరిద్రం దండయాత్ర మొదలుపెట్టి వెయ్యి రోజులు అయింది. రాష్ట్ర సంపదను కొల్లగొట్టే విషయంలో సీఎం, మంత్రులు కొట్టుకుంటున్నారు.

**దిల్లీకి మూటలు.. పదవుల కోసం కీచులాటలు..**

కాంగ్రెస్ పాలనలో దిల్లీకి మూటలు.. పదవుల కోసం కీచులాటలు తప్ప ఏం లేదు. రైతుబంధు బంద్ అయ్యింది.. రాహుల్ బంధు మొదలైంది. గోదావరి, కృష్ణా జలాల వాటాల్లో తెలంగాణకు అన్యాయం జరిగితే మిమ్మల్ని వదిలిపెట్టం. కాళేశ్వరం మీద కక్షకట్టి.. రైతులను శిక్షిస్తున్నారు. మిస్ వరల్డ్ పోటీలు, మెస్సీ కోసం నిధులు భారీగా ఖర్చు చేస్తారు. కానీ, రైతులకు నీళ్లు ఇచ్చేందుకు మాత్రం డబ్బులు ఖర్చు పెట్టరు. కాంగ్రెస్ వచ్చిన ఏడాదిలోనే 2లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు. జాబ్ క్యాలెండర్ పేరిట.. జాబ్‌లెస్ క్యాలెండర్ ఇచ్చారు. దిల్లీలో రాహుల్ జెన్ జీని వెంటపెట్టుకొని.. ప్రజాస్వామ్యమని కొటేషన్లు చెబుతున్నారు. తెలంగాణలో మాత్రం నిరుద్యోగులపై దాడులు జరుగుతున్నాయి" అని విమర్శించారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో పాటు పలువురు సీనియర్ నేతలు సమావేశంలో పాల్గొన్నారు.

# బీసీనైన నాకో న్యాయం.. ఇతరులకు మరో న్యాయమా?: కొండా సురేఖ

మొదటిపేజీ తరువాయి

తన విషయంలో కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయం కోసం వేచిచూస్తున్నట్లు తెలంగాణ మంత్రి కొండా సురేఖ తెలిపారు. దిల్లీలో మీడియాతో ఆమె చిట్‌చాట్ నిర్వహించారు. "ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిశాను. పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో ఇంకా మాట్లాడలేదు. నన్ను రాజీనామా చేయమని ఇప్పటివరకు చెప్పలేదు. బీసీనైన నాకు ఒక న్యాయం.. ఇతర సామాజిక వర్గాలకు మరో న్యాయం పాటిస్తారా? క్యాబినెట్‌లో ఉన్న ఇతర సామాజిక వర్గాల వారిపై పెద్ద ఎత్తున ఆరోపణలు ఉన్నాయి. వాటన్నిటికీ ఏం సమాధానం చెబుతారు? ఏం చర్యలు తీసుకుంటారు? జరుగుతున్న అన్ని వ్యవహారాలపై ఇప్పటికే ఖర్గే, రాహుల్, ప్రియాంక గాంధీ సహా అధిష్ఠాన ముఖ్యులందరికీ రాతపూర్వకంగా తెలియజేశాను. అన్ని విషయాలనూ పరిగణనలోకి తీసుకోవాలని ఇవాళ ఖర్గేను కలిసిన సందర్భంగా కోరాను" అని కొండా సురేఖ అన్నారు.

# కాంగ్రెస్ 1000 రోజుల ప్రజా పాలన సక్సెస్

మొదటిపేజీ తరువాయి

కోర్టు ద్వారా గ్రూప్-1 నియామకాలు ఆపాలని చూశారు. ఇటీవలే 10వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చాం. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతిహామీని నెరవేరుస్తున్నాం. గత ప్రభుత్వ బకాయిలు, అప్పులను చెల్లిస్తున్నాం. పేదలకు సంక్షేమ పథకాలు అందించాలనే తపనతో పనిచేస్తున్నాం.
బీఆర్ఎస్ నేతల ఉద్యోగాలను ఊడగొట్టారని ప్రజలను వారు రెచ్చగొడుతున్నారు. ప్రభుత్వం చేసిన ఏ కార్యక్రమాన్నీ ప్రతిపక్షాలు ప్రశంసించలేదు. ఉప ఎన్నికల్లో ఎన్ని పొర్లుదండాలు పెట్టినా కాంగ్రెస్ గెలిచింది. ఓడినా బీఆర్ఎస్‌కు జ్ఞానోదయం కాలేదు. ప్రజలు అసహ్యించుకుంటున్నా ఆ పార్టీ నేతలు మారలేదు. గతంలో బతుకమ్మ చీరల్లోనూ అవినీతికి పాల్పడ్డారు. కేటీఆర్ హద్దు మీరి మాట్లాడితే ప్రజలు క్షమించరు. రాహుల్‌గాంధీని ఉద్దేశించి ఆయన సంస్కారహీనంగా మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చారు. పదేళ్లపాటు పేదలకు రేషన్‌కార్డులు కూడా ఇవ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లలోపే కొత్తగా 15లక్షల కార్డులు ఇచ్చింది. కొత్తగా దాదాపు 3 లక్షల మంది వితంతువులు, వృద్ధులకు పింఛన్లు ఇవ్వనున్నాం" అని పొంగులేటి అన్నారు.

# యూకేలో ఎంబీఏ.. బాసర బ్రిడ్జిపై నుంచి పడి యువకుడి మృతి

మొదటిపేజీ తరువాయి

ఈ నెల 5న తిరిగి యూకే వెళ్లాల్సి ఉంది. ఈ క్రమంలో మంగళవారం బాసర ఆలయానికి సాయికిరణ్ వెళ్లాడు. దర్శనం అనంతరం బ్రిడ్జిపై ఫొటోలు దిగుతుండగా ప్రమాదవశాత్తు నదిలో పడిపోయాడు. విషయం తెలుసుకుని కుటుంబసభ్యులు గాలింపు చేపట్టగా బుధవారం అతడి మృతదేహం లభ్యమైంది. తండ్రి రమావత్ భోజారామ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పీఎస్‌లో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఫ్యామిలీ ప్రాబ్లమ్స్ వల్ల KTR ఫ్రస్టేషన్ లో మాట్లాడుతున్నడు: మంత్రి వివేక్ వెంకట స్వామి

మొదటిపేజీ తరువాయి

కాళేశ్వరం ప్రాజెక్ట్ లో లక్ష కోట్ల అవినీతి జరిగిందని.. కూలిపోయే ప్రాజెక్ట్ ను కట్టారని దుయ్యబట్టారు. ఈ విషయంపై మాట్లాడటానికి.. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో జరిగిన అన్యాయంపై కేటీఆర్ ఎందుకు నోరెత్తటం లేదని మంత్రి ప్రశ్నించారు.

# వామ్మో.. పంట చేన్లలో తిరుగుతున్న పెద్ద పులి.. వీడియో చూసి వణికిపోతున్నరు !

సకినాపూర్: ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం సకినాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కడపల్లి గ్రామ పంట చేన్లలో పెద్దపులి కనిపించిందన్న వార్త కలకలం రేపుతోంది. స్థానిక యువకుడు పులిని ఫోటో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో విషయం వైరల్‌గా మారింది.గత కొద్దిరోజులుగా పులి సంచారం ఉందన్న ప్రచారం ఉన్నప్పటికీ ఎవరూ పట్టించుకోలేదని గ్రామస్తులు చెబుతున్నారు. తాజాగా పులి కనిపించడంతో రైతులు, ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అటవీ అధికారులు వెంటనే స్పందించి పులి సంచారాన్ని నిర్ధారించి, ప్రజలకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) రేంజ్ రావణ్ పల్లిలో పులి దాడిలో ఓ ఎద్దు చనిపోయిన ఘటన కూడా కలకలం రేపిన సంగతి తెలిసిందే.

# నీటిని పొలిటికల్ వెపన్‌గా వాడొద్దు: పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్



షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్సీఓ) సమిట్?లో పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ భారత్‌ను ఉద్దేశించి పరోక్ష వ్యాఖ్యలు చేశారు. ఏ ప్రాంతానికైనా నీరు జీవనాధారమని, దానిని ఎప్పటికీ రాజకీయ ఆయుధంగా, ఒత్తిడి సాధనంగా ఉపయోగించకూడదని అన్నారు. సింధు జలాల ఒప్పందం (ఐడబ్ల్యూటీ) అంతర్జాతీయంగా కట్టుబడి అమలు చేయాల్సిన ఒప్పందమని, దాన్ని ఏకపక్షంగా పక్కన పెట్టకూడదని పేర్కొన్నారు.
పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ సింధు జలాల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ షరీఫ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదం పాకిస్తాన్?కు అతిపెద్ద ముప్పుగా మారిందని, గత రెండున్నర దశాబ్దాల్లో ఉగ్రవాద వ్యతిరేక పోరులో 90 వేల మందికిపైగా ప్రాణాలు కోల్పోయారని షరీఫ్ అన్నారు. 150 బిలియన్ డాలర్లకుపైగా ఆర్థిక నష్టం వాటిల్లిందని చెప్పారు. ఉగ్రవాదులకు అఫ్గానిస్తాన్ ఆశ్రయం ఇస్తున్నన్ని రోజులు శాశ్వత శాంతి సాధ్యం కాదని వ్యాఖ్యానించారు. హోర్ముజ్? జలసంధి మూసివేత వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడిందని, అమెరికా -- ఇరాన్ మధ్య సయోధ్యకు పాకిస్తాన్ మధ్యవర్తిత్వం వహించిందని చెప్పారు.

**మోదీని కట్ చేసి, ఫొటో పోస్ట్**

ఎస్సీవో సదస్సు సందర్భంగా పాక్ తన వంకరబుద్ధి చాటుకుంది. సదస్సులో సభ్య దేశాల అధినేతలంతా కలిసి గ్రూప్ ఫొటో దిగగా.. అందులోంచి మోదీ తోపాటు మరికొందరు నేతలు లేకుండా ఫొటోను క్రాప్ చేసింది. తాను మధ్యలో ఉన్నట్టు కనిపించేలా చేసిన ఫొటోను పాక్ ప్రధాని షరీఫ్ షేర్ చేశారు. కానీ, మోదీ మాత్రం అందరూ ఉన్న ఫుల్ ఫొటోను షేర్ చేశారు. దీంతో పాక్ వంకర బుద్ధిపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి.

# నేపాల్‌లో వెయ్యి దాటిన డెత్స్.. ఇంకా 4 వేల మంది మిస్సింగ్

- 158 మంది భారతీయులను రక్షించిన రెస్క్యూ టీమ్స్
- నదుల్లో పెరిగిన ప్రవాహం.. ఫ్లాష్ ఫ్లడ్ అలెర్ట్ జారీ

నేపాల్‌లో మృతుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. మంగళవారం నాటికి 1,050 మంది డెడ్?బాడీలు లభ్యమైనట్టు అధికారులు తెలిపారు. 8 జిల్లాల నుంచి భద్రతా దళాలు మృతదేహాలను వెలికితీశాయని చెప్పారు. చిత్వాన్ జిల్లాలో 321, నవల్‌పరాసి తూర్పులో 216, నవల్‌పరాసి పశ్చిమంలో 170, నువాకోట్‌లో 95, గోర్ఖాలో 65, ధాడింగ్‌లో 57, రసువాలో 41 మరియు తనహూన్‌లో 38 మృతదేహాలను వెలికితీసినట్టు నేషనల్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ అండ్ మేనేజ్‌మెంట్ అథారిటీ వెల్లడించింది. అయితే, మరో 4 వేల మంది ఆచూకీ ఇంకా లభించలేదు. గల్లంతయిన వారి కోసం రెస్క్యూ బృందాలు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. వరద ప్రభావిత ప్రాంతంలోని రెండు జలవిద్యుత్ సొరంగాల వద్దకు భారత రక్షణ బృందాలు చేరుకున్నాయి. ఇప్పటివరకు 158 మంది భారతీయులను రక్షించారు. ఇంకా వందలాది మంది కార్మికుల ఆచూకీ తెలియడం లేదు. ఇప్పటివరకు 12 వేల మందిని రక్షించారు. ఇండియన్? స్పెషల్? టన్నెల్- రెస్క్యూ టీంలు సహా విదేశీ టీం?లతో గాలింపు విస్తృతంగా చేపడుతున్నారు.
ఎఆర్‌శీతీఎ

**మళ్లీ పొంచి ఉన్న వరద ముప్పు**

నేపాల్‌లో ఇంకా వరద ముప్పు పొంచి ఉంది. గిరాంగ్ ప్రాంతంలో మళ్లీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఇది సమీపంలోని బ్యారియర్ లేక్ నీటి మట్టాలను పెంచుతుందని చైనా వాతావరణ నిపుణులు హెచ్చరించారు. అంతేకాకుండా, హిమానీనదాలు (గ్లేసియర్స్) కూలిపోయే ప్రమాదం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, నేపాల్‌లో సంభవించిన హిమానీనద (గ్లేషియర్) వరదల నేపథ్యంలో సిక్కిం ప్రభుత్వం అప్రమత్తమైంది. రాష్ట్రంలో ఉన్న 400కి పైగా సరస్సుల్లో అత్యంత ముప్పు ఉన్న 16 హిమానీనద సరస్సులను గుర్తించారు. గ్లేషియర్ లేక్ అవుట్‌బర్స్ట్ ఫ్లడ్స్ ముప్పును ముందుగానే పసిగట్టేందుకు నీటి మట్టాలు, వాతావరణ మార్పులను ఎప్పటికప్పుడు గమనించేలా అధునాతన సెన్సార్లు, ఆటోమేటెడ్ వేదర్ స్టేషన్లు, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను ఏర్పాటు చేశారు.

**చావును దగ్గర నుంచి చూశాం..**

నేపాల్ వరదల నుంచి బయటపడిన అస్సాంకు చెందిన 8 మంది కార్మికులు సురక్షితంగా తమ స్వగ్రామాలకు చేరుకున్నారు. వీరంతా అక్కడి 'అప్పర్ త్రిశూలి-1' జలవిద్యుత్ ప్రాజెక్టులో పనిచేస్తుండగా, ఒక్కసారిగా వరద నీరు, బురద ముంచెత్తింది. కార్మికులు ఆహారం, నీరు లేకుండా రెండు రోజులు కొండపై గడిపారు. ఆ తర్వాత నేపాల్ సైనిక హెలికాప్టర్లు వీరిని గుర్తించి తరలించాయి. కళ్లముందే చావును చూశామని, అదృష్టవశాత్తూ బయటపడ్డామని వారు చెప్పారు. కాగా, అక్కడే మరికొందరు కార్మికులు గల్లంతయ్యారు.

## మరోసారి రాజగోపాల్‌రెడ్డి
# సంచలన వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి

మా ఇంట్లోకి వచ్చి మమ్మల్నే వెళ్లగొట్టాలని చూస్తున్నారు అంటూ పరోక్షంగా కేబినెట్‌లోని కీలక నేతలను, పార్టీలోని వలస నేతలను లక్ష్యంగా చేసుకుని ధ్వజమెత్తారు.
తనకు పదవుల పట్ల ఆశ లేదని చెప్తూనే, సమయం వచ్చినప్పుడు పదవులు అవే వెతుక్కుంటూ వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. భవిష్యత్తులో కచ్చితంగా ముఖ్యమంత్రి స్థానాన్ని అధిష్టిస్తానని స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీలో చేరే ముందు తనకు మంత్రి పదవి ఇస్తామని అధిష్టానం హామీ ఇచ్చిందని, అయితే ఆ హామీ నెరవేరకపోవడంపై ఆయన తీవ్ర నిరాశతో ఉన్నట్లు తెలుస్తోంది.
పదవుల కంటే రాజకీయాల్లో, ప్రభుత్వ వ్యవస్థల్లో మార్పు రావడం ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. పేద ప్రజల సమస్యలను పక్కనబెట్టి సొంత ప్రయోజనాల కోసం పనిచేసే సంస్కృతి మారాలని, అభివృద్ధి పనులు నిలిచిపోవడంపై తాను గళం విప్పుతూనే ఉంటానని రాజగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ 1000 రోజుల పాలన సూపర్ సక్సెస్: ఉత్తమ్

మొదటిపేజీ తరువాయి

కార్యనిర్వాహకప్రభుత్వ సేవలను తెలుసుకోవడంసీడబ్ల్యూసీలో పెండింగ్ లో ఉన్న అనుమతులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని అన్నారు మంత్రి ఉత్తమ్. తెలంగాణ సమస్యలను ప్రస్థావించామని.. తుమ్మిడిహెట్టి పై చర్చలు జరుపుతున్నామని... 152 మీటర్ల ఎత్తులో కట్టాలని డిమాండ్ చేశామని..ఆమేరకే కట్టెందుకు అనుమతి వస్తుందనే విశ్వాసం ఉందని అన్నారు ఉత్తమ్.
సీఎం రేవంత్ నాయకత్వం లో వెయ్యి రోజుల్లో ప్రజలకు మంచి పాలన అందించామని.. ప్రజాస్వామ్యపాలన, ప్రజా పాలన వచ్చిందనే భావన తెలంగాణ ప్రజల్లో ఉందని అన్నారు ఉత్తమ్.స్వతంత్ర భారతంలో ఎప్పుడు జరగనట్లుగా తెలంగాణలో సన్నబియ్యం ఇచ్చామని... మంచి క్వాలిటీ ఇందిరమ్మ ఇల్లు, ధాన్యం కొనుగోలు ఇట్లా అనేక సంక్షేమ పాలన ఇస్తున్నామని స్పష్టం చేశారు ఉత్తమ్.

# కొండా సురేఖ అంశం అధిష్టానంతో వివరించాం.. పీసీసీ చీఫ్

మొదటిపేజీ తరువాయి

కాగా నిన్న తెలంగాణ కాంగ్రెస్‌లో సంస్థాగత వ్యవహారాలపై చర్చించేందుకు సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ ఢిల్లీకి వెళ్లారు. పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో వారు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కొండా సురేఖ వ్యవహారంతో పాటు పార్టీ సంస్థాగత అంశాలు, కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన తదితర అంశాలపై చర్చించనున్నట్లు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు.
పార్టీ సంస్థాగత బలోపేతం, రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులపై కూడా అధిష్టానంతో చర్చించినట్లు తెలుస్తోంది.ఈ నేపథ్యంలో కొండా సురేఖ వ్యవహారంలో కాంగ్రెస్ అధిష్ఠానం ఏం చర్యలు తీసుకోనుందా అనే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది.

# KPHB లో గజం భూమి రూ.2.70 లక్షలు!

మొదటిపేజీ తరువాయి

గ్రేటర్ హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో కేపీహెచ్‌బీకి క్రేజ్ ఎలా ఉందో మరోసారి రుజువైంది. కేపీహెచ్‌బీ 7వ ఫేజ్‌లోని హౌసింగ్ బోర్డు ఓపెన్ ప్లాట్ల బహిరంగ వేలానికి భారీ స్పందన లభించింది. రికార్డు స్థాయి ధరలకు భూములు అమ్ముడయ్యాయి. ఇక్కడ చదరపు గజం భూమి గరిష్టంగా రూ.2.70 లక్షల పలికింది.
కెపిహెచ్‌బీ 7వ ఫేజ్‌లోని 16 ఎంఐజీ ఓపెన్ ప్లాట్లకు బుధవారం హౌసింగ్ బోర్డు వేలం నిర్వహించింది. ఈ వేలంలో పాల్గొనేందుకు మొత్తం 19 మంది బిడ్డర్లు పోటీ పడ్డారు. అధికారుల అంచనాలను మించుతూ వేలంలో కొనుగోలుదారులు పోటీపడి పాట పాడారు.
వేలంలో గజానికి కనీస మద్దతు ధర రూ.1.60 లక్షలుగా నిర్ణయించగా, గరిష్ఠంగా రూ.2.70 లక్షల వరకు ధర వెళ్లింది. మరో ప్లాట్ గజం రూ.2.36 లక్షలకు విక్రయమవ్వగా, రెండు ప్లాట్లు గజానికి రూ.2.06 లక్షల చొప్పున అమ్ముడయ్యాయి.వేలం ముగిసే సమయానికి గజం సగటు ధర రూ.1.79 లక్షలుగా నమోదైంది. ఈ 16 ప్లాట్ల విక్రయం ద్వారా తెలంగాణ హౌసింగ్ బోర్డుకు రూ.47.14 కోట్ల మేర భారీ ఆదాయం సమకూరింది.
వేలం ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించినట్లు తెలంగాణ హౌసింగ్ బోర్డు తెలిపింది. కేపీహెచ్‌బీ ప్రాంతంలోని ప్లాట్లకు కొనుగోలుదారుల నుంచి ఇప్పటికీ నిరంతర భారీ డిమాండ్ ఉందనడానికి ఈ వేలం ఫలితాలే నిదర్శనమని హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ వీపీ గౌతం పేర్కొన్నారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
గురువారం సెప్టెంబర్ 03, 2026

# మండల స్థాయి పద్య పఠన పోటీల్లో విద్యార్థుల ప్రతిభకు ప్రశంసలు

**కరపత్రం ప్రతినిది వెల్గటూర్, సెప్టెంబర్ 2**



తెలుగు భాషా సాహిత్యంపై విద్యార్థుల్లో ఆసక్తి పెంపొందించడంతో పాటు పద్య పఠన నైపుణ్యాలను ప్రోత్సహించేందుకు నిర్వహించిన మండల స్థాయి పద్య పఠన పోటీల్లో వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు.సీనియర్ విభాగంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వెల్గటూర్‌కు చెందిన పి. సాత్విక ప్రథమ బహుమతిని కైవసం చేసుకోగా, మోడల్ పాఠశాల, కుమ్మరిపల్లికి చెందిన ఎం. వర్షిణి ద్వితీయ బహుమతిని అందుకుంది.జూనియర్ విభాగంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పైడిపల్లికి చెందిన జి. రాష్మిత ప్రథమ బహుమతి సాధించగా, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, స్తంభంపల్లికి చెందిన ఎల్. దీప్తి ద్వితీయ బహుమతిని దక్కించుకుంది.ఈ సందర్భంగా విజేతలను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందిస్తూ, జిల్లా స్థాయి పోటీల్లోనూ ఇదే స్థాయి ప్రతిభ కనబర్చి మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా తెలుగు భాషా సాహిత్య పరిరక్షణకు ఇటువంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు.

# మహానేత వైఎస్సార్‌కు ఘన నివాళులు

- ప్రజా సంక్షేమమే వైఎస్సార్ చిరస్మరణీయ వారసత్వం: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**కరపత్రం ప్రతినిది ధర్మపురి, సెప్టెంబర్ 2**



దివంగత మాజీ ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లోని పంజాగుట్ట వైఎస్సార్ విగ్రహం వద్ద బుధవారం ఘన నివాళుల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి భావపూర్వకంగా నివాళులర్పించారు.

మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి వాకిటి శ్రీహరితో పాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని మహానేతకు ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రిగా డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి రైతు సంక్షేమం, పేదల అభ్యున్నతి, సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమాన్ని పాలనకు కేంద్రబిందువుగా నిలిపారని కొనియాడారు. ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్, జలయజ్ఞం, ఇందిరమ్మ గృహాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి సంక్షేమ కార్యక్రమాలతో కోట్లాది మంది ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన మహానేతగా ఆయన చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు.

ప్రజా సంక్షేమమే పరమావధిగా భావించిన వైఎస్సార్ ఆశయాలను కొనసాగిస్తూ ప్రతి వర్గానికి న్యాయం జరిగేలా కృషి చేయడమే ఆయనకు నిజమైన నివాళి అవుతుందని నాయకులు స్పష్టం చేశారు. వైఎస్సార్ సేవలను స్మరించుకుంటూ కార్యక్రమంలో పాల్గొన్న వారంతా ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఆయన ప్రజాహిత పాలన, సేవా తత్వం తరతరాలకు ఆదర్శంగా నిలుస్తాయన్నారు.

# నేడు వెల్గటూర్‌లో వైఎస్సార్ వర్ధంతి వేడుకలు

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహణ



**కరపత్రం ప్రతినిది ధర్మపురి, సెప్టెంబర్ 2**

దివంగత మాజీ ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నివాళుల కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్గటూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, పీసీసీ సభ్యుడు తాటిపర్తి శైలెందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, సర్పంచులు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారని పేర్కొన్నారు. గురువారం ఉదయం 11.00 గంటలకు వెల్గటూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నిర్వహించే ఈ కార్యక్రమంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పత్రికా, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా ప్రతినిధులు కార్యక్రమానికి హాజరై విస్తృత ప్రచారం అందించాలని తాటిపర్తి శైలెందర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# బీఎస్ఐటీ సాఫ్ట్‌వేర్ సర్వీసెస్‌కు ప్రతిష్టాత్మక 'గ్లోబల్ బిజినెస్ ఎక్సలెన్స్ ఇన్ ఐటీ 2026' అవార్డు

**కరపత్రం ప్రతినిది హైదరాబాద్, సెప్టెంబర్ 2**




ఐటీ రంగంలో 11 సంవత్సరాలుగా విజయవంతంగా కొనసాగుతున్న బీఎస్ఐటీ సాఫ్ట్‌వేర్ సర్వీసెస్ సంస్థకు ప్రతిష్టాత్మక 'గ్లోబల్ బిజినెస్ ఎక్సలెన్స్ ఇన్ ఐటీ 2026' అవార్డు లభించింది. గ్లోబల్ ట్రయంఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వరల్డ్ బిజినెస్ కాన్క్లేవ్ 2026 కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు, సీఈవోలు భాను చందర్, శారద ఈ అవార్డును అందుకున్నారు. సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, వెబ్, మొబైల్ అప్లికేషన్ల అభివృద్ధి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఐఓటీ, క్లౌడ్, సైబర్ భద్రత, డిజిటల్ సేవల రంగాల్లో బీఎస్ఐటీ సాఫ్ట్‌వేర్ సర్వీసెస్ అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు లభించింది. నాణ్యమైన సాంకేతిక సేవలు, వినియోగదారుల అవసరాలకు అనుగుణమైన పరిష్కారాలతో బీఎస్ఐటీ సాఫ్ట్‌వేర్ సర్వీసెస్ ఐటీ రంగంలో విశ్వసనీయ సంస్థగా మంచి గుర్తింపు పొందింది. వ్యవస్థాపకులు, సీఈవోలు భాను చందర్, శారద నాయకత్వంలో సంస్థ విజయవంతంగా ముందుకు సాగుతోంది. ఈ సందర్భంగా భాను చందర్, శారద మాట్లాడుతూ, ఈ అవార్డు తమ సంస్థతో పాటు తమ బృందం చేస్తున్న కృషికి దక్కిన గుర్తింపుగా భావిస్తున్నామని తెలిపారు. సంస్థపై నమ్మకం ఉంచిన వినియోగదారులు, భాగస్వాములకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మారుతున్న సాంకేతిక అవసరాలకు అనుగుణంగా మరింత మెరుగైన సాఫ్ట్‌వేర్, డిజిటల్ పరిష్కారాలను అందిస్తూ సేవలను మరింత విస్తరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

# కాంగ్రెస్ హామీల అమలుపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుంది: మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్

- 420 హామీలు, 13 డిక్లరేషన్లు, 6 గ్యారెంటీల అమలుపై ప్రభుత్వం సమాధానం చెప్పాలి
- ప్రజలకు ఇచ్చిన ప్రతి మాటను గుర్తు చేస్తూ ప్రభుత్వాన్ని నిలదీస్తాం
- హామీలు అమలు చేసే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదు






**కరపత్రం ప్రతినిది బ్యూరో, సెప్టెంబర్ 2**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ అమలు అయ్యే వరకు భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పోరాటం నిరంతరం కొనసాగుతుందని మాజీ ఎమ్మెల్యే శ్రీ వొడితల సతీష్ కుమార్ స్పష్టం చేశారు. బుధవారం హుస్నాబాద్ మండల కేంద్రంలో.. పార్టీ శ్రేణులతో కలిసి ప్రధాన చౌరస్తా వద్ద.. కాంగ్రెస్ వెయ్యి రోజుల హామీ విఫలమైందంటూ.. హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ.. ధర్నా చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ 420 హామీలు, 13 డిక్లరేషన్లు, 6 గ్యారెంటీలు పేరుతో ప్రజలకు అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిందని గుర్తు చేశారు. అయితే వెయ్యి రోజుల పాలన పూర్తయినప్పటికీ వాటిలో అనేక హామీలు ఇప్పటికీ అమలుకు నోచుకోలేదని విమర్శించారు. ఇది ప్రభుత్వ చేతకానితనానికి, ప్రజలను మోసం చేసిన తీరుకు నిదర్శనమని ఆరోపించారు.

ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఆయన పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను విస్మరిస్తే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని ప్రజలకు గుర్తు చేస్తూ, ఒక్కో హామీ అమలు కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని తెలిపారు.

ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి రావడం సాధ్యమైనా, ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా తప్పించుకోవడం సాధ్యం కాదని సతీష్ కుమార్ అన్నారు. 420 హామీల పరిస్థితి ఏమిటి? 6 గ్యారెంటీల అమలు ఎక్కడికి చేరింది? 13 డిక్లరేషన్లలో ఎన్ని అమలయ్యాయి? అనే ప్రశ్నలకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ప్రజల కష్టాలు, సమస్యలు, హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ ఎప్పుడూ ముందుండి పోరాడుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రతిపక్షంగా ప్రజల గొంతుకగా వ్యవహరిస్తూ, ఎన్నికల హామీల అమలు కోసం ప్రభుత్వంపై నిరంతరం ఒత్తిడి తీసుకొస్తామని వెల్లడించారు.

ప్రతి బాకీ హామీని ప్రజల ముందుకు తీసుకెళ్తామని, ప్రజలకు ఇచ్చిన మాటను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకునే వరకు తమ ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. "మాట తప్పితే ప్రశ్నిస్తాం... హామీ అమలు కాకపోతే నిలదీస్తాం... ప్రజలకు అన్యాయం జరిగితే కొట్లాడుతాం... ప్రతి హామీ నెరవేరే వరకు మా సమరం ఆగదు" అని మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా నాయకులు, మండల నాయకులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనకు నిరసనగా ఉప్పల్‌లో బీఆర్ఎస్ మహాధర్నా

- అమలు కాని హామీలు, ప్రజా సమస్యలపై ప్రభుత్వ వైఫల్యాలపై ఆందోళన -- భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు

**కరపత్రం ప్రతినిది రామంతపూర్ ప్రతినిధి మహేందర్, సెప్టెంబర్ 2**






బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనపై నిరసన వ్యక్తం చేస్తూ ఉప్పల్ రింగ్‌రోడ్‌లో బుధవారం భారీ మహాధర్నా నిర్వహించారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, ప్రజలను మోసం చేసిందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ మహాధర్నాలో పార్టీ శ్రేణులతో పాటు వివిధ వర్గాలకు చెందిన ప్రజలు కూడా భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన ప్రధాన హామీల్లో చాలా వరకు నెరవేర్చలేదని విమర్శించారు. రైతులు, యువత, మహిళలు, నిరుద్యోగులు, ఉద్యోగులు సహా అన్ని వర్గాల ప్రజలు తీవ్ర నిరాశకు గురయ్యారని పేర్కొన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి కంటే ప్రచారానికే ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు.

ధర్నా ప్రాంగణంలో పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపేలా ఆటపాటలతో కూడిన సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగాయి. బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. ప్రజా సమస్యలపై పోరాటమే తమ పార్టీ ధ్యేయమని, ప్రజల హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా పార్టీ కార్యకర్తలు, నాయకులకు బాకీ కార్డుల పంపిణీ కార్యక్రమం కూడా నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు ఇప్పటికీ "బాకీ"గానే మిగిలిపోయాయని ప్రతీకాత్మకంగా తెలియజేస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. మహా ధర్నాలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువజన విభాగం ప్రతినిధులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# శిరీషా కుటుంబానికి బీఆర్ఎస్ అండగా ఉంటుంది: ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

- బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.50 వేల ఆర్థిక సాయం
- కేటీఆర్ ఫోన్‌లో ఓదార్పు.. న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని భరోసా






**కరపత్రం ప్రతినిది భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 2**

అత్యాచారానికి గురై హత్యకు గురైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ముల్కలపల్లి మండలం చౌటిగూడెంకు చెందిన యువతి శిరీషా కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుతో కలిసి శిరీషా నివాసానికి వెళ్లిన ఆయన, ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి. రామారావు (కేటీఆర్)తో ఫోన్‌లో బాధిత కుటుంబ సభ్యులను మాట్లాడించారు. శిరీషా తల్లి రామలక్ష్మి, సోదరుడు శివరాంను కేటీఆర్ పరామర్శిస్తూ, ఈ విషాద సమయంలో పార్టీ అండగా ఉంటుందని, ధైర్యంగా ఉండాలని సూచించారు.

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేయగా, ఈ దారుణ ఘటనను అసెంబ్లీలో ప్రస్తావించి న్యాయం జరిగేలా అన్ని విధాలా కృషి చేస్తామని కేటీఆర్ హామీ ఇచ్చినట్లు ఎంపీ రవిచంద్ర తెలిపారు. నిందితుడికి చట్టపరంగా అత్యంత కఠిన శిక్ష పడేలా బీఆర్ఎస్ తరఫున పోరాటం కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా శిరీషా తల్లి రామలక్ష్మికి ఎంపీ వద్దిరాజు రవిచంద్ర రూ.50 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పి, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని భరోసా కల్పించారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఉప్పల వెంకటరమణ, కాపు సీతామహాలక్ష్మి, సింధూ తపస్వి, ఉపాధ్యాయుల సూర్యప్రకాశరావు, మోరంపూడి అప్పారావు, పుష్పాల చందర్‌రావు, మేకల వెంకటేశ్వరరావు, కొండవీటి రాజారావు, మేకల రాజేష్, గ్రామ సర్పంచ్ పద్మతో పాటు పలువురు పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

7

# సీఎం రేవంత్ రెడ్డి మాటలు..తుపాకీ రాముని మాటలు ఒక్కటే

- వాగ్దానాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం..మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

**కరపత్రం ప్రతినిది వరంగల్/పాలకుర్తి,సెప్టెంబర్ 2**





కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని మాజీ మంత్రి,బీఆర్ఎస్ నేత ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆరోపించారు.కాంగ్రెస్ 1000 రోజుల పాలనకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీలతో పాటు 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు.హామీలను గుర్తుచేసేందుకే 420 అడుగుల ఫ్లెక్సీ ప్రదర్శన,గ్రామాల్లో బాకీ కార్డుల పంపిణీ చేపట్టామని తెలిపారు.మహిళలకు నెలకు రూ.2,500,వృద్ధులు,బీడీ కార్మికులకు రూ.4 వేలు,దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్,రైతు భరోసా,రుణమాఫీ,పంటలకు బోనస్,రైతు కూలీలకు ఆర్థిక సాయం,నిరుద్యోగ భృతి,ఉద్యోగాల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతో విద్యార్థులు,కళాశాలలు ఇబ్బందులు పడుతున్నాయని అన్నారు.తెలంగాణను బంగారు తెలంగాణ దిశగా తీసుకెళ్లిన గత పాలనను పక్కనపెట్టి రాష్ట్రాన్ని మళ్లీ సమస్యల దిశగా తీసుకెళ్తున్నారని ఎర్రబెల్లి విమర్శించారు.విద్యుత్,యూరియా,సాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయని ఆరోపించారు.ప్రజా సమస్యలపై ఉద్యమాలు,పోరాటాలు చేయడం బీఆర్ఎస్‌కు కొత్తేమీ కాదని,ప్రభుత్వం మెడలు వంచైనా ఇచ్చిన హామీలను అమలు చేయించే వరకు పోరాటం కొనసాగిస్తామని ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో దేవరుప్పుల,కొడకండ్ల,పాలకుర్తి మండలాలకు చెందిన బీఆర్ఎస్ జిల్లా,మండల,గ్రామ,యువజన,సోషల్ మీడియా నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అధికారం కోల్పోయామన్న అక్కసుతోనే బీఆర్ఎస్ విమర్శలు

- 1000 రోజుల కాంగ్రెస్ పాలనే మా ప్రోగ్రెస్ రిపోర్ట్.. చెప్పినవి చేస్తున్నాం.. చెప్పనివి కూడా చేస్తున్నాం
- హనుమకొండ డీసీసీ కార్యాలయంలో మీడియాతో వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య

**కరపత్రం ప్రతినిధి బ్యూరో, సెప్టెంబర్ 2**

అధికారం కోల్పోయామన్న అక్కసుతోనే బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరాధార విమర్శలు చేస్తున్నారని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య విమర్శించారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించి నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం విమర్శలకు కాదు, నిర్మాణాత్మక సూచనలకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని స్పష్టం చేశారు. బుధవారం హనుమకొండ డీసీసీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డితో కలిసి పాల్గొన్న ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడారు. పదేళ్ల పాలన అనంతరం ప్రజలు ప్రతిపక్షంలో కూర్చోబెట్టినా బీఆర్ఎస్ నాయకులు రెండుమూడేళ్లు కూడా ఓపిక పట్టలేకపోతున్నారని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ప్రతి రోజూ విమర్శలు చేయడం అధికార దాహానికే నిదర్శనమని వ్యాఖ్యానించారు. ప్రజల తీర్పును గౌరవించి బాధ్యతాయుతమైన ప్రతిపక్ష పాత్ర పోషించాలని సూచించారు.

**1000 రోజులే కాంగ్రెస్ ప్రోగ్రెస్ రిపోర్ట్**

రెండున్నరేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో గణనీయమైన మార్పు తీసుకువచ్చిందని డా. కావ్య పేర్కొన్నారు. విద్యార్థి ఏడాది చదివిన తర్వాత ప్రోగ్రెస్ రిపోర్ట్ చూసుకున్నట్లే, కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనే తమ ప్రోగ్రెస్ రిపోర్ట్ అని అన్నారు. ప్రభుత్వం చేసిన ప్రతి పనిని గణాంకాలతో ప్రజల ముందుంచామని, బీఆర్ఎస్ పదేళ్ల పాలనతో కాంగ్రెస్ రెండున్నరేళ్ల పాలన మధ్య తేడాను ప్రజలే గమనిస్తున్నారని తెలిపారు.

**అభివృద్ధి--సంక్షేమం రెండు కళ్లు**

భారీ అప్పుల భారాన్ని మిగిల్చిన పరిస్థితుల్లోనూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు కట్టుబడి ఉందని చెప్పారు. ఆరు గ్యారంటీల అమలుతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను సమాంతరంగా కొనసాగిస్తున్నామని, అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వానికి రెండు కళ్లలాంటివని పేర్కొన్నారు.

**విద్యార్థులను ఉద్యమానికి వాడుకున్నారు.. విద్యకు ఏం చేశారు?**

తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులను



ఉపయోగించుకున్న బీఆర్ఎస్, అధికారంలోకి వచ్చిన తర్వాత వారి భవిష్యత్తు కోసం ఏం చేసిందని ప్రశ్నించారు. యూనివర్సిటీలకు వైస్ ఛాన్సలర్ల నియామకాలు చేపట్టలేదని, ముఖ్యమంత్రి స్థాయిలో విద్యారంగంపై సమీక్ష కూడా నిర్వహించలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విశ్వవిద్యాలయాలకు వైస్ ఛాన్సలర్ల నియామకాలు చేపట్టడంతో పాటు ప్రభుత్వ, రెసిడెన్షియల్ విద్యాసంస్థల అభివృద్ధికి చర్యలు తీసుకుందని తెలిపారు. నాణ్యమైన విద్య కోసం ఉపాధ్యాయ నియామకాలకు ప్రాధాన్యమిస్తూ డీఎస్సీ ద్వారా సుమారు 10 వేల మంది ఉపాధ్యాయులను నియమించామని చెప్పారు.

**70 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం**

తెలంగాణ వస్తే ఉద్యోగాలు వస్తాయని చెప్పిన బీఆర్ఎస్ పెద్దఎత్తున నియామకాలు చేపట్టలేదని విమర్శించిన ఎంపీ, కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్లలోనే వివిధ శాఖల్లో సుమారు 70 వేల ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పించిందని పేర్కొన్నారు.

**మహిళల ఆర్థిక సాధికారతే లక్ష్యం**

మహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. మహిళా సంఘాలకు సుమారు రూ.60 వేల కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందించామని, పెట్రోల్ బంకులు, సోలార్ ప్లాంట్లు తదితర రంగాల్లో మహిళలకు అవకాశాలు కల్పిస్తున్నామని వెల్లడించారు.

**అసంపూర్తి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లే బీఆర్ఎస్ పాలనకు నిదర్శనం**

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో పదేళ్లు హామీలు ఇచ్చిన బీఆర్ఎస్, అనేక ప్రాంతాల్లో ఇళ్లను అసంపూర్తిగా వదిలేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్లలోనే తొలి దశలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక పూర్తిగా అర్హత ఆధారంగానే జరుగుతోందని, రాజకీయ పక్షపాతానికి తావు లేదని స్పష్టం చేశారు.

**నిర్మాణాత్మక విమర్శలకు స్వాగతం**

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రాజకీయ అనుభవం ఉందని, అభివృద్ధికి ఉపయోగపడే సూచనలు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం స్వాగతిస్తుందని చెప్పారు. అయితే అసెంబ్లీకి రాకుండా కాలయాపన చేయడం, రోజూ రాజకీయ విమర్శలు చేయడం వల్ల రాష్ట్రానికి ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. ప్రజలు అధికార పక్షానికి, ప్రతిపక్షానికి ఇచ్చిన బాధ్యతలను గౌరవించాలని, ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చర్చలకు ప్రతిపక్షం ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

**చెప్పినవి చేస్తున్నాం.. చెప్పనివి కూడా చేస్తున్నాం..**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుతో పాటు ప్రజల అవసరాలకు అనుగుణంగా కొత్త కార్యక్రమాలను కూడా చేపడుతోందని డా. కడియం కావ్య పేర్కొన్నారు. "బీఆర్ఎస్ పదేళ్లలో చేయలేని అనేక పనులను కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్లలో చేసి చూపించింది. చెప్పినవి చేస్తున్నాం.. చెప్పనివి కూడా చేస్తున్నాం. 1000 రోజుల కాంగ్రెస్ పాలనే మా ప్రోగ్రెస్ రిపోర్ట్" అని ఆమె స్పష్టం చేశారు.

**వైఎస్సార్‌కు ఘన నివాళి**

అనంతరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా హనుమకొండ డీసీసీ కార్యాలయంలో ఎంపీ డా. కడియం కావ్య ఘనంగా నివాళులర్పించి ఆయన ప్రజాసంక్షేమ సేవలను స్మరించుకున్నారు. ఈ సమావేశంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, వరంగల్ డీసీసీ కమిటీ అధ్యక్షులు మహమ్మద్ అయూబ్, జిల్లా నేతలు తదితరులు పాల్గొన్నారు.

# కొండ సురేఖకు ముప్పు లేదు రేవంత్ వ్యూహానికి బ్రేక్

- 'కొండా'కు 'కొండంత' అండ!
- సురేఖ వ్యవహారం ఢిల్లీకి..సీఎం శిబిరంలో మొదలైన గుబులు
- అధిష్ఠానం పెద్దల మద్దతుతో మారిన రాజకీయ సమీకరణాలు

**కరపత్రం ప్రతినిది వరంగల్,సెప్టెంబర్ 2**

తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రి కొండా సురేఖ చుట్టూ నెలకొన్న రాజకీయ పరిణామాలు ఇప్పుడు ఢిల్లీకి చేరడంతో రాష్ట్ర కాంగ్రెస్‌లో ఉత్కంఠ నెలకొంది.సురేఖను రాజకీయంగా ఒంటరి చేసి,ఆమెను ఇరకాటంలో పెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్న సమయంలోనే అధిష్ఠానం పెద్దల నుంచి ఆమెకు మద్దతు లభించినట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.దీంతో ఇప్పటివరకు ఒక దిశగా సాగిన వ్యవహారం ఒక్కసారిగా మలుపు తిరిగినట్లు తెలుస్తోంది.సురేఖకు కీలక నేతల అండ మంత్రి కొండా సురేఖకు ఏఐసీసీ స్థాయిలోని కొందరు కీలక నేతలతోపాటు రాష్ట్ర కేబినెట్‌లోని ఇద్దరు ముఖ్య మంత్రులు,పీసీసీకి చెందిన కీలక నేత మద్దతుగా నిలిచినట్లు సమాచారం.దీంతో సురేఖ వర్గంలో కొత్త ఉత్సాహం కనిపిస్తుండగా..ఆమెపై చర్యల దిశగా సాగుతున్న ప్రయత్నాలకు బ్రేకులు పడినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ



జరుగుతోంది.బీసీ అస్త్రంతో మహేష్ గౌడ్‌కు సవాల్ మంత్రి సురేఖ వ్యవహారం పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌కు కూడా రాజకీయంగా సవాల్‌గా మారినట్లు తెలుస్తోంది.సురేఖపై చర్యలకు సహకరిస్తే బీసీ వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురయ్యే అవకాశం ఉందని పలువురు బీసీ నేతలు హెచ్చరించినట్లు సమాచారం.దీంతో పార్టీ అంతర్గత సమీకరణాలను దృష్టిలో పెట్టుకుని పీసీసీ అధ్యక్షుడు తన వైఖరిలో మార్పు చేసినట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ సాగుతోంది.ఢిల్లీలో మారిన లెక్కలు మంత్రి కొండా సురేఖ వ్యవహారంపై చర్చించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌తో కలిసి ఢిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను కలిసినట్లు సమాచారం.ఈ సందర్భంగా రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలు,సురేఖ వ్యవహారంపై సీఎం వర్గం తమ వాదనలను అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది.అయితే సురేఖ వర్గం కూడా తమ వాదనలను అధిష్ఠానం పెద్దల ముందు బలంగా వినిపించినట్లు సమాచారం.ఇరువర్గాల వాదనలు విన్న అధిష్ఠానం..తొందరపాటు నిర్ణయాలకు వెళ్లకుండా వ్యవహరించినట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.దీంతో సురేఖపై చర్యలు తీసుకోవాలన్న ప్రయత్నాలకు తాత్కాలికంగా బ్రేక్ పడినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.అధిష్ఠానం నిర్ణయంపైనే ఉత్కంఠ ఢిల్లీ పరిణామాలతో రాష్ట్ర కాంగ్రెస్‌లో రాజకీయ వేడి మరింత పెరిగింది.ఒకవైపు సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని వర్గం..మరోవైపు మంత్రి కొండా సురేఖకు మద్దతుగా నిలుస్తున్న నేతల మధ్య సమీకరణాలు మారుతున్నట్లు కనిపిస్తోంది.అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఇప్పుడు తెలంగాణ కాంగ్రెస్‌లో హాట్‌టాపిక్‌గా మారింది.అయితే సురేఖ వ్యవహారంపై అధిష్ఠానం నుంచి అధికారికంగా ఎలాంటి నిర్ణయం వెలువడలేదు.దీంతో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలన్నీ కాంగ్రెస్ వర్గాల్లో జరుగుతున్న చర్చలు,సమాచారం ఆధారంగానే ఉన్నాయి.

# బీఆర్ఎస్‌కు షాక్.. కాంగ్రెస్‌లో చేరిన పులిగిల్ల సర్పంచ్ పద్మ ఐలయ్య

- దాదాపు 20 మంది నాయకులు, కార్యకర్తలతో కలిసి హస్తం గూటికి చేరిక

**కరపత్రం ప్రతినిది నడికూడ, సెప్టెంబర్ 2**



నడికూడ మండలం పులిగిల్ల గ్రామంలో బీఆర్ఎస్‌కు ఎదురుదెబ్బ తగిలింది. గ్రామ సర్పంచ్ ఇనుగాల పద్మ ఐలయ్య బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి వారిని కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పద్మ ఐలయ్య మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. గ్రామాభివృద్ధితో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ వేదికగా మరింత సమర్థంగా పనిచేస్తామని పేర్కొన్నారు. పద్మ ఐలయ్యతో పాటు బీఆర్ఎస్‌కు చెందిన వార్డు సభ్యుడు ఇనుగాల సువార్త-శ్రీనివాస్, మాజీ వార్డు సభ్యులు గజ్జి కైలాసం, కాంతమ్మ, పాలకుర్తి సురేష్, ఇనుగాల సుదర్శన్, బొల్లె రవీందర్, ఇనుగాల కుమార్ సహా దాదాపు 20 మంది నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో నడికూడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పర్నెం మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి బచ్చుటి మోహన్‌రావు, గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కవితపై అనుచిత పోస్టు.. పోలీస్ కానిస్టేబుల్‌పై చర్యలకు ఫిర్యాదు

- సోషల్ మీడియాలో అవమానకర వ్యాఖ్యలపై చట్టపరమైన, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి: తెలంగాణ రక్షణ సేన
- టీఆర్ఎస్ గ్రేటర్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు లయన్ డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు ఆధ్వర్యంలో..

**కరపత్రం ప్రతినిది బ్యూరో, సెప్టెంబర్ 2**

తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవితపై సోషల్ మీడియా వేదికగా అనుచిత, అవమానకరమైన వ్యాఖ్యలు చేస్తూ పోస్టు చేసిన కె. అనిల్ అనే పోలీస్ కానిస్టేబుల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ.. తెలంగాణ రక్షణ సేన గ్రేటర్ వరంగల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ వెంకటేశ్వర్ రావు ఆధ్వర్యంలో సుబేదారి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంబంధిత పోస్టుపై సమగ్రంగా విచారణ జరిపి బాధ్యుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు శాఖాపరంగా కూడా చర్యలు చేపట్టాలని ఫిర్యాదులో



కోరారు. ఈ సందర్భంగా తెలంగాణ రక్షణ సేన గ్రేటర్ వరంగల్ అధ్యక్షుడు నడిపెల్లి వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ.. సోషల్ మీడియాను వేదికగా చేసుకుని వ్యక్తుల గౌరవాన్ని కించపరిచే విధంగా బాధ్యతారహిత వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదన్నారు. ముఖ్యంగా పోలీస్ శాఖలో పనిచేసే వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలకు పాల్పడటం మరింత బాధ్యతారాహిత్యమని పేర్కొన్నారు. ఫిర్యాదును సమగ్రంగా పరిశీలించి కె. అనిల్‌పై




చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, అలాగే శాఖాపరమైన విచారణ జరిపి తగిన చర్యలు చేపట్టాలని సుబేదారి సీఐ ఎం. రంజిత్ కుమార్‌ను కోరినట్లు తెలిపారు. చట్టాన్ని ఎవరూ తమ చేతుల్లోకి తీసుకోకుండా, సోషల్ మీడియా వేదికలపై కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని వెంకటేశ్వర్‌రావు అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి నరేందర్‌కు లేదు

- బీఆర్ఎస్ నేత నరేందర్‌పై కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజీనాల శ్రీహరి ఫైర్

**కరపత్రం ప్రతినిది వరంగల్, సెప్టెంబర్ 2**



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజీనాల శ్రీహరి తీవ్రంగా ఖండించారు.సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి నరేందర్‌కు లేదని ఆయన మండిపడ్డారు. రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేస్తే బీఆర్ఎస్ అధిష్ఠానం తనకు మళ్లీ టికెట్ ఇస్తుందనే ఒకే ఒక్క అభిప్రాయంతో నరేందర్ బతుకుతున్నారని ఎద్దేవా చేశారు.ముందుగా తన స్థాయి ఏమిటో గుర్తు పెట్టుకుని మాట్లాడాలని హితవు పలికారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన తర్వాతి కాలంలో కాంట్రాక్టర్లను వేధించి అక్రమంగా సొమ్ము కూడబెట్టారనే ఆరోపణలు ప్రజల్లో ఉన్నాయని శ్రీహరి విమర్శించారు.ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని,గతంలో తాను ఏం చేశానో నరేందర్ ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఇకపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే తీవ్రంగా ప్రతిఘటిస్తామని రాజీనాల శ్రీహరి హెచ్చరించారు.మాజీ ఎమ్మెల్యే,మాజీ మేయర్‌గా ఉన్న నరేందర్ తన స్థాయిని గుర్తుంచుకుని మాట్లాడాలని సూచించారు.

# వినాయకుడి నుంచి సైబర్ భద్రత పాఠాలు

- అవగాహన పోస్టర్ ఆవిష్కరించిన సీపీ ఎన్.శ్వేత

**కరపత్రం ప్రతినిది వరంగల్,సెప్టెంబర్ 2**

సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత,ఐపీఎస్ సూచించారు.వినాయక చవితిని పురస్కరించుకుని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో రూపొందించిన 'వినాయకుడి నుంచి సైబర్ భద్రత పాఠాలు' అవగాహన పోస్టర్‌ను బుధవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఆమె ఆవిష్కరించారు.వినాయకుడి పెద్ద చెవులు ప్రతి విషయాన్ని జాగ్రత్తగా వినాలని,చిన్న కళ్లతో నిశితంగా గమనించాలని,పెద్ద తలతో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని సూచిస్తున్నట్లుగా పోస్టర్‌లో సైబర్ భద్రతపై అవగాహన కల్పించారు.అత్యాశ,భయం,తొందరపాటు వంటి భావోద్వేగాలను సైబర్ నేరగాళ్లు ఆసరాగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారని సీపీ తెలిపారు.తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్,మెసేజ్‌లు,ఈ-మెయిల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని,అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దని సూచించారు.గుర్తుతెలియని యాప్‌లను



డౌన్‌లోడ్ చేయడంతోపాటు బ్యాంకు ఖాతా వివరాలు,ఏటీఎం/డెబిట్ కార్డు సమాచారం,పాస్‌వర్డ్‌లు,ఓటీపీ,పిన్ వంటి రహస్య సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని స్పష్టం చేశారు.ఆన్‌లైన్ ఉద్యోగాలు,పెట్టుబడులు,రుణాలు,బహుమతులు,లాటరీల పేరుతో వచ్చే ఆకర్షణీయమైన ప్రకటనలను నమ్మి మోసపోవద్దన్నారు.సోషల్ మీడియాలో అపరిచితులతో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దని,ఖాతాల భద్రత కోసం బలమైన పాస్‌వర్డ్‌లతో పాటు టూ-ఫ్యాక్టర్ ఆథెంటికేషన్‌ను వినియోగించాలని సూచించారు.మోసానికి గురైతే వెంటనే 1930కు ఫోన్ సైబర్ మోసానికి గురైన వారు ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని సీపీ శ్వేత సూచించారు. అలాగే cybercrime.gov.in ద్వారా ఫిర్యాదు చేయాలని తెలిపారు.మోసం జరిగిన వెంటనే స్పందిస్తే డబ్బును తిరిగి పొందే అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు.ప్రజల్లో సైబర్ భద్రతపై అవగాహన పెంచేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సీపీ తెలిపారు.కార్యక్రమంలో సైబర్ క్రైమ్ స్టేషన్ ఏసీపీ వెంకటరమణ,సీఎస్‌బీ--2 ఏసీపీ జానీ నర్సింహులు,సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఎస్ఐలు చరణ్,శివ తదితరులు పాల్గొన్నారు.

# ఖర్గేతో మంత్రి కొండా సురేఖ భేటీ

- రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై ఏఐసీసీ అధ్యక్షుడితో చర్చ

**కరపత్రం ప్రతినిది వరంగల్,సెప్టెంబర్ 2**



న్యూఢిల్లీ: రాష్ట్ర అటవీ,పర్యావరణ,దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ న్యూఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను మర్యాదపూర్వకంగా కలిశారు.కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం ఇందిరా భవన్‌లో ఈ భేటీ జరిగింది.ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ రాష్ట్రంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు,కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన పలు అంశాలపై ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేతో చర్చించినట్లు తెలిపారు.రాష్ట్రంలో పార్టీ కార్యకలాపాలు,రాజకీయ పరిణామాలు,ప్రజా సమస్యలు తదితర అంశాలపై ఇరువురు నేతలు చర్చించినట్లు పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం సూచనలు,రాష్ట్రంలో పార్టీని మరింత బలోపేతం చేయడం,ప్రభుత్వ సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి అంశాలపైనా చర్చ జరిగినట్లు సమాచారం.ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడిని మంత్రి సురేఖ మర్యాదపూర్వకంగా కలవడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.